

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



– 26 –

**ప్రపంచం చాలా చిన్నది.**

నిజంగా చిన్నది.

తెలిసిన మనుషులే మళ్ళీ మళ్ళీ కలుస్తుంటారు.

ఇంకా ఇంకా బాగా తెలుస్తుంటారు.

❦❦❦

ఉదయం పది గంటలు.

ఒక పాతికేళ్ళ అమ్మాయి రోడ్డు పక్కనే నిలబడి ఉంది.

మనిషిని చూస్తే, వయసు ఇరవైకు మించి ఉండదేమో అనిపించేలా ఉంది. పదినిముషాల నుండీ ఆమె రోడ్డు దాటడానికి ప్రయత్నిస్తూ, వచ్చే పోయే వాహనాల వంక చూస్తోంది.

దాటాలని ముందుకు వస్తోంది. వేగంగా వచ్చే వాహనాలకు భయపడి వెనక్కి వెళ్ళిపోతోంది.

రోడ్డు కవతల వేపున్న బంగళా గేటు బయట స్టూల్ మీద కూర్చున్న వాచ్ మాన్ ఆమెను చూస్తూనే ఉన్నాడు.

ఆమె ఆ బంగళాలోపలికే రావాలనుకుంటోందని అర్ధమైందతనికి.

ఎందుకంటే, దగ్గర్లో వేరే ఇల్లుగానీ, ఆఫీసు కానీ లేదు. ఆ బంగళాలో ఉద్యోగాలకోసం చాలామంది వస్తుంటారు. బహుశా ఆమెకూడా అందుకోసమే అనుకున్నాడు. స్టూల్ మీద ముందుకు వంగి కూర్చుని , ఆమె ఎప్పుడు దాటుతుందా అని అన్నట్టు చూస్తున్నాడు.

ఆమె పసుపుపచ్చ చీర కట్టుకుని ఉంది. ఓ అయిదు నిముషాల తర్వాత , గాలికెగిరిపోతున్న కొంగుని, చేతితో అదుపు చేసి వేగంగా నడిచి బంగళా ముందుకు వచ్చింది. ఆమె చేతిలో అతి చిన్న పర్స్. వందో , రెండొందలో మించి ఉండే అవకాశమే లేని పర్స్.

గేటు దగ్గరకు రాగానే " ఏం కావాలి?" అని అడిగాడు వాచ్ మాన్.

"మేడం ని కలవాలి"

" మేడం నా? ఏ మేడం?"

బంగళాలో పని చేసే చిన్న సెక్రటరీని కూడా మేడం అనే పిలుస్తాడతను.

"మేడం." క్షణం ఆగి "శార్వాణి!" అన్నది.

పేరు చెప్పాక, ఆమె బట్టలు చూసి "మేడం తో ఏం పని నీకు?" అసహనంగా అడిగాడు.

అతని ప్రశ్నలో తిరస్కారం విన్నాక , మేడం మాకు బంధువనీ, స్వంత పెదనాన్న కూతురే అని చెప్పడానికి వెనకాడింది.

"మేడం వాళ్ళు, మాకు బాగా తెలుసు." అంది.

ఆ అమ్మాయి ముఖంలో పట్టుదల చూసి, 'తనెందుకు పొమ్మనాలి. లోపలికి ఫోన్ చేస్తే ఎటూ పొమ్మంటారు' అనుకుని ఫోన్ చేతిలోకి తీసుకుని

"నీ పేరు చెప్పు."

"మధుర, అనంతగిరి. ప్రకాశ రావుగారి అమ్మాయినని చెప్పండి."

లోపలి నుండి అనుమతి రావడంతో గేటు తెరిచాడు. రోడ్డు పక్కన చిన్న కొండ మీద కట్టిన బంగళా. గేటు నుండి బంగళా వరకూ ఏటవాలుగా సిమెంట్ రోడ్ ఉంది. పైకి నడుస్తుంటే, కాళ్ళు నొప్పిగా అనిపించింది. దారికిరువైపులా రకరకాల పూల చెట్లు, ఉదయపు చల్లగాలికి ఊగుతూ ఉన్నాయి. చాలా సేపు నడిచాక ఇంటి ముందుకు చేరుకుంది. వెడల్పుగా ఉన్న టేకు తలుపులు మూసి ఉన్నాయి. వాటి పైన ఇత్తడి నగిషీ పని చేసి ఉంది.

బయట వరండాలో ఇత్తడి కుండీలలో పూల చెట్లున్నాయి. మనుషులు తిరుగుతున్న జాడే లేదు. ఎంతో సేపు ఎదురు చూసింది. పోనీ వాచ్ మాన్ వరకూ వెళితే అనుకుంది.

దూరంగా దిగువన కనిపిస్తున్న అతని కేబిన్ వైపు చూసింది. మళ్ళీ కింది వరకూ వెళ్ళడం, రావడం ఎందుకులే అని మూసి ఉన్న తలుపులవంక చూస్తూ నిలబడింది. అక్కడ కాలింగ్ బెల్ లాంటిదేమీ లేదు. పోనీ తలుపు కొడితే, అని దగ్గరకు వెళ్ళి తలుపు కొట్టబోతే, అవే సున్నితంగా తెరుచుకున్నాయి.

లోపలంతా వెలుగు. పట్ట పగలే అయినా , లోపల ఎన్నో దీపాలు వెలుగుతూ ప్రకాశంగా ఉంది. ఎదురుగా విశాలమైన మెట్లున్నాయి. మెట్ల మీద ఎర్రని తివాచి. ఒక నాజూకైన అమ్మాయి మెట్లమీద నుండి నడిచి వస్తోంది. ఆమె ఎంతో పద్ధతిగా చీర కట్టుకుని ఉంది. చిన్న పూల డిజైన్ ఉన్న సిల్క్ చీర.

ఆమెకు ఎదురుగా వెళ్ళి 'తనొచ్చిన పని చెప్తే' అనుకుని ముందుకెళ్ళబోయింది. ఇంతలో తన వెనుకనుండి వేరే అమ్మాయి ఆ మెట్ల మీద నుండి నడచి వచ్చే అమ్మాయికి ఎదురు వెళ్ళింది. ఆమె కూడా అదే చీర కట్టుకుని ఉంది. అదే పద్ధతిలో. చిన్న చిరునవ్వుతో పలకరించుకున్నారు.

మధుర తల పైకెత్తి చూసింది. మేడ పైకి చూస్తే, వరండాలలో ఇలాంటి చీరలే కట్టుకున్న ఆడపిల్లలు తిరుగుతున్నారు. అది ఆ ఇంట్లో పనిచేసే వారి యూనిఫాం కాబోలు అనుకుంది.

వారిలో వారు ఎదురు పడినపుడు చాలా మెత్తగా మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళు చూడక ముందే, తన చెప్పులు మెట్ల పక్కనున్న ఇత్తడి పూలకుండీ వెనక విడిచింది. ఆ వాతావరణంలో ఇమడవనిపించి మరింత మూలకు తోసింది. ఇక, ఎవరికీ కనిపించవు అన్న నమ్మకం వచ్చాక మెట్ల దగ్గర నిలబడింది.

ఇంతలో ఒక అమ్మాయి వచ్చి "మీ పేరు?" అడిగింది.

"మధుర."

"అనంతగిరి. ప్రకాశంగారి అమ్మాయి?" ఈ వివరాలు మీవేనా అన్నట్లు అడిగింది.

అవునన్నట్లు తలూపింది.

"ఇలా రండి." అంటూ మెట్ల పైకి తీసుకెళ్ళింది.

అడుగడుగునా అదే చీరకట్టుతో ఆడపిల్లలు కనిపిస్తున్నారు. అందరిలోనూ ఒకే రకమైన ఒద్దిక .

మెట్లన్నీ దాటాక ఏవో వరండాలలో నుండి వెళుతున్నారు. దారిలో పెద్ద పెద్ద పింగాణీ కుండీలు. విశాలమైన వరండాలలో ఎక్కడ చూసినా, గోడలకు పెయింటింగ్స్ ఉన్నాయి. ఓ అరగంట స్థిమితంగా నిలబడి, పరీక్షగా చూస్తే ఏమైనా అర్థం కావొచ్చేమో.

ప్రతి హాల్లోనూ, వరండాలలో, కూర్చునే వీలుగా చక్కటి సోఫాలున్నాయి. రెండు మూడు కారిడార్స్ దాటి ఎంతో దూరం నడిచాక ఒక హాల్లోకి తీసుకుని వెళ్ళింది.

“ఇక్కడ కూర్చోండి.” అని చెప్పి వెళ్ళింది ఆ అమ్మాయి.

తను కూర్చున్న హాలు వంక చూసింది మధుర. కాళ్ళ కింద అందమైన డిజైన్ ఉన్న మెత్తటి నాచు రంగు తివాచీ ఉంది. గోడలమీద పెయింటింగ్ చూస్తే ఒకే రకమైన మనుషులు, వేరు వేరు భంగిమలలో ఉన్నారు. పరీక్షగా చూస్తే చిన్ననాడు చదువుకున్న పర్షియన్ కథ జ్ఞాపకం వచ్చింది. అదేమిటో చూసే స్థిమితం లేదు.

ఆ వాతావరణం మొత్తం గమనించాక, ఆమెను కలిస్తే, తనసలు మాట్లాడగలదా అన్న అనుమానం వచ్చింది. తామిద్దరి మధ్యా ఉన్న చుట్టరికం గురించీ, తనెందుకు వచ్చిందో, తన అవసరమేమిటో ఇవన్నీ వివరంగా చెప్పగలదా?

అవన్నీ అసాధ్యమైన పనులుగా తోచాయి.

అలాంటి పాలెస్ కు తను రావడం ఏమిటి. ఆమెకే ఆశ్చర్యంగా అనిపించింది.

అవసరం ఎంత దూరమైనా నడిపిస్తుంది.

సహాయం కోసం వెతకడం వల్ల నష్టమేమీ లేదు. కనీసం లేదు అన్న సమాధానమైనా దొరుకుతుంది.

"ఓ పావుగంటలో మేడం వస్తారు." ఎవరో వచ్చి చెప్పి వెళ్ళారు.

మేడం! శార్వాణి.

ఆమె తమ ఇంటి ఆడపిల్లలలో అందరికన్నా పెద్దది. ఆమె డిగ్రీ చదువుకునే రోజుల్లో , ఇరవై ఏళ్ళకే ఒక పెద్దింటి సంబంధం వచ్చింది. ఆమె చదివే కాలేజీ ప్రిన్సిపాల్ కు స్నేహితురాలైన ఒక కోటీశ్వరురాలు, తన ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి చేయాలనీ, తమ కుటుంబానికి తగిన అమ్మాయిలెవరైనా కాలేజీలో ఉన్నారేమో చెప్పమని వచ్చినపుడు, శార్వాణి ని చూపించారా ప్రిన్సిపాల్.

అందం, చదువు, అణకువ, ఉన్న శార్వాణి, ఆ వచ్చినావిడకు ఎంత గానో నచ్చింది. పెళ్ళి అయాక సొంత ఊరికి , తమవారికి దూరమైంది శార్వాణి. ఆమె తండ్రి చనిపోవడంతో , మిగిలిన బంధువులూ దూరమయ్యారు.

ఎప్పుడో చిన్నతనం లో చూసిన గుర్తు. తాను ఎవరో చెప్తే అర్థం అవుతుందా?

సోఫా అంచున కూర్చుంది. వెనక్కి ఆనుకునే ఉద్దేశం లేనట్టు! తను వచ్చిన ద్వారం వంక చూస్తూ ఉంది. ఎవరైనా వస్తే అటువేపు నుండే రావాలి. అది తప్ప ఆ హాలు కు వేరే తలుపు ఏదీ లేదు.

ద్వారం వంకే చూస్తూ ఉంటే , వెనక నుండి ఒక చెయ్యి భుజం మీద పడింది. ఉలికిపడి వెనక్కి తిరిగి చూస్తే ఒకామె చిరునవ్వుతో నిలబడి ఉంది.

ఈమె హఠాత్తుగా ఎలా ప్రత్యక్షమైంది అని లేచి నిలబడి, చుట్టూ చూసింది.

గోడ మీద కథ లాంటి పెయింటింగ్ మధ్యలో ఒక చోట తెరుచుకుని ఉన్న తలుపు కనిపించింది. అక్కడొక తలుపు ఉంటుందని ఊహించడం కష్టమే.

ఆమె వంక చూసింది. ‘శార్వాణి అంటే ఈమే’ అని ఎవరూ చెప్పకుండానే తెలిసిపోయింది.

ఆమెను  ఒక సారి చూసి, వెంటనే చూపు తిప్పుకోవడం అసాధ్యం. ముదురు కుంకుమ రంగు పట్టు చీర కట్టుకుంది. వత్తైన జుట్టుని పద్ధతిగా ముడి వేసుకుంది. ఆమె మేని ఛాయ బంగారు కాంతులీనుతోంది.

చెవులుకున్న కెంపులు చెంపలకు రంగులద్దుతున్నాయో, రంగులందుకుంటున్నాయో, తెలియకుండా ఉంది. ఆమె రూపం, లావణ్యం, చూస్తే, ఆ యూనిఫాం లో ఉన్న ఆడపిల్లలది కూడా ఒక అందమేనా అనిపించింది. అంతటి అందగత్తెను , అంత దగ్గరగా చూడడం అదే మొదటిసారి.

“నీ పేరేమిటి?”

“మధుర.”

“ప్రకాశం బాబాయి వాళ్ళమ్మాయివా? ఎప్పుడో చిన్నప్పుడు చూశాను.” అంటూ నిలబడి ఉన్న మధురని కూర్చోమని సైగ చేస్తూ ఆమె దగ్గర్లో ఉన్న వేరే సోఫాలో కూర్చుంది.

నాన్నని ఆమె బాబాయనడంతో, ఊపిరి పీలుచుకుంది మధుర.

‘ఆ అమ్మాయి ఎందుకు వచ్చి ఉంటుందో!’ అనుకుంది శార్వాణి.

నది దగ్గరకెవరైనా ఎందుకెళతారు. నీళ్ళకోసమే.

డబ్బున్న వారింటికి పేదవారెందుకెళతారు?

సహాయం కోసమే.

ఆ సాహసం చేయించేది పేదరికమే.

విషయం తెలిసినా తక్కువ స్థాయివారిని అవమానపరచడం లాంటి మూర్ఖపు పనులు చెయ్యదు. ఆమె ఎవరినీ చిన్నబుచ్చదు. చక్కగా మాట్లాడుతుంది.

మధుర ఉండేదెక్కడో, ఏం పని చేస్తుందో కొన్ని వివరాలు కనుక్కుంది.

ఒక ప్రైవేట్ కాలేజిలో పనిచేస్తూ, సివిల్స్ కు ప్రిపేర్ అవుతోంది.

అంటే వచ్చింది ఉద్యోగం కోసం కాదు.

“బాబాయి బాగున్నాడా?” నిట్టూర్చింది.

ఆ ప్రశ్నకు సమాధానంగా  తలూపింది మధుర.

“బాబాయి రాలేదేం? చూసి ఎన్నాళ్ళో అయింది.”

“నాన్నకు ఆరోగ్యం బాగా లేదు.”

ఇప్పుడు కొద్దిగా అర్థం అయింది. ఆ అమ్మాయి ఎందుకు వచ్చి ఉంటుందో.

సంభాషణ మధ్య మధ్యలో, ఆమె కోసం ఎవరెవరో ఫోన్ చేస్తూ ఉన్నారు. వస్తానని చెప్తూ ఉంది.

“మీరెక్కడికైనా వెళ్ళాలేమో నండీ”

“నిజమే మధూ. అర్జంటుగా వెళ్ళాల్సిన పని ఉంది.”  తన పేరునంత మధురంగా పిలిచినవారెవరూ లేరు.

“ నాకు ఒక అపాయింట్మెంట్  ఇప్పించండి. చిన్న విషయం మీతో మాట్లాడాలి.” చివరి మాటలు ఆమెకే వినబడనంత మెల్లగా అన్నది.

“నేను అక్కనవుతానోయ్. నీకు అపాయింట్మెంట్ ఏమిటి?” అంది శార్వాణి చిరునవ్వుతో. ఆమె అంత మంచిగా మాట్లాడడం మధురకు నమ్మకం కలగడం లేదు.

అందమైన అబద్ధాన్ని దగ్గర్నుండి చూస్తున్న భావన .

“రేపోసారి కనిపిస్తావా, ఇప్పుడొక మీటింగ్ కు వెళ్ళాలి.”

“తప్పకుండా!” అంటూ లేచి నిలబడింది.

రేపు ఆమె వస్తే రిసీవ్ చేసుకోవాలని అక్కడ యూనిఫాం చీరలో వున్న ఆడపిల్లల్లో ఒకమ్మాయికి ఒప్పగించింది.

గేటు వరకూ నడుస్తుంటే, తెలిసింది, ఎక్కేటపుడున్న అలుపు , దిగేటపుడుండదని!

గేటు వద్ద వాచ్ మాన్ ఆమె వంక వింతగా చూశాడు. ఆమె నడకలో, చూపులో మార్పు గమనించాడు.

రేపటినుండీ ఈ అమ్మాయి కూడా అక్కడ పనిచేసే ఆడపిల్లల్లాగా బస్ లో దిగుతుంది. యూనిఫాం చీరలో కనిపిస్తుంది అనుకున్నాడు. ఇంతలో అతనికి ఫోన్ వచ్చింది.

"అట్టాగేనమ్మా. అట్టాగే” అన్నాడు.

మధుర వెళ్ళిపోతుంటే పిలిచాడు. “అమ్మాయ్” అని

“నీ పేరు ,అదీ చెప్పు.”

రిజిస్టర్ లో పేరు రాసుకున్నాడు.

“రేపు ఏడింటికి రావాలంట. సెక్రటరీ అమ్మగారు చెప్పారు.”

మాట్లాడకుండా తలూపింది.

ఆమె ఆటోలో వెళ్దామనుకుంది. కానీ ఆ విషయం మర్చిపోయి, తల దించుకుని నడుస్తూ ఉంది. పైన విమానం వెళ్తున్న శబ్దం వినిపించింది. తెలియకుండానే తలెత్తి చూసింది. అలా చూస్తూ నడుస్తుంటే, ఆమె పక్క నుండి ఎరుపు కారు వెళ్ళింది.

కార్లో, కూర్చున్న శార్వాణిని చూసింది. పక్కనే ఎవరో ఒక మగ మనిషి కూర్చుని ఉన్నాడు. తెల్లగా ఉన్నాడు. ఆమె భర్త కాబోలు అనుకుంది.

విమానాలే కాదు, కొన్ని కార్లు కూడా మనకోసం ఆగకపోవడం సహజం.

మర్నాడు సరిగ్గా చెప్పిన టైం కు వెళ్ళింది. ఆమెను వెంటనే లోపలికి అనుమతించాడు వాచ్ మాన్.

ఆమెను నిన్నటి హాల్లో కాకుండా వేరే వైపు తీసుకుని వెళ్ళి, ఒక బాల్కనీ లో కూర్చోబెట్టారు. అర్థ చంద్రాకారంలో ఉన్న బాల్కనీ అది. దూరంగా పెద్ద గార్డెన్ కనిపిస్తోంది. పిట్టగోడకు ఆనుకుని చక్కటి సోఫాలు వున్నయి. వానొస్తే , ఇవి పాడైపోవూ అనుకుని ముట్టుకుని చూసింది. తడిమి చూశాక పాడవవు అనుకుంది.

వాటిమీద కూర్చోలేనంత బాగున్నాయి.

ఉదయం ఏడున్నర అవుతున్నా, పెద్ద ఎండగా లేదు. ఒక రౌండ్ టేబిల్, దాని చుట్టూ కుర్చీలు వేసి ఉన్నాయి. గులాబి పూల డిజైన్ కుషన్ ఉన్న కుర్చీలున్నాయి. బాల్కనీకు రెండు పక్కలా, అందమైన పూల చెట్లు కుండీలు ఉన్నాయి. ఆమె పిట్ట గోడ దగ్గర నిలబడి దూరంగా గార్డెన్ లో పనిచేసే పనివాళ్ళ వంక చూస్తోంది.

ఆ వాతావరణంలో ఏమాత్రం ఇమడని వస్తువు తనే అనుకుంది.

చక్కటి పరిమళం చుట్టు ముట్టే సరికి తిరిగి చూసింది. తెల్లని ఖాదీ చీరలో శార్వాణి. నల్లని బ్లౌజ్. అలంకరణలు లేని దేవతలా ఉంది.

"నిలబడే ఉన్నావే?" అంటూ భుజం మీద చెయ్యి వేసింది.

ఆమె చిరునవ్వు చూసి, ముడుచుకుపోయింది. శాకాహారిగా మారిన సింహంతో స్నేహం చేసినట్లే ఉంది.

"రా కూర్చో." అంటూ పిట్టగోడకు ఆనుకుని సోఫామీద కూర్చుంది. కొంచం దూరంలో ఉన్న కుర్చీలో బెరుకుగా కూర్చుంది మధుర.

"నిన్న చాలా ముఖ్యమైన మీటింగ్ ఉంది మధూ. పోస్ట్ పోన్ చేసుకోలేకపోయాను. కానీ నిన్న సాయంత్రమే బావగారితో చెప్పేశాను. రేపు మా చెల్లి వస్తుంది. ఆఫీసుకు రాలేనని. ఇవాళ ఎక్కడికీ వెళ్ళాల్సిన పనిలేదు. హాయిగా మాట్లాడుకుందాం" అంది.

ఎవరో ఇద్దరు పనివాళ్ళు వచ్చారు. వాళ్ల దుస్తులు కిచెన్ లో పనిచేసేవారిలా ఉన్నాయి. చాలా సేపు కాఫీ టేబిల్ మీద కాఫీ సామగ్రి సర్దుతూ గడిపారు. ఎన్నో రకరకాల పింగాణీ సామానులు. పాలకు, డికాక్షన్ కు , పంచదారకూ వేరు వేరుగా ఉన్నాయి. కాఫీ తయారు చేసి ముందు శార్వాణికి ఇచ్చారు. మధుర దగ్గర కూడా నిలబడి ఏవి ఎంత మోతాదులో కావాలో అడిగి కాఫీ తయారు చేసి ఇచ్చారు.

కాఫీ వేడి లేదు.

వెంటనే తాగేసి అక్కడ పెట్టేసింది.

వాళ్ళు వెళ్ళిపోయాక, శార్వాణి తండ్రితోనూ, ఊరితోనూ, ఉన్న అనుబంధం గురించి చెప్పింది. ఎవరెవరో బంధువుల గురించి అడిగింది. ఎవరెక్కడ సెటిల్ అయారో వివరాలు తెలుసుకుంది. తన చిన్ననాటి ముచ్చటలు చెప్పింది. తన పెళ్ళికి మధుర ఏడెనిమిదేళ్ళ పిల్ల అని గుర్తు చేసింది.

మధురకు ఆమె పెళ్ళి జ్ఞాపకం ఉంది. దగ్గర్లోని సిటీలో, పెద్ద ఎత్తున జరిగింది. పెళ్ళి తర్వాత శార్వాణి వీళ్ళ ఊరికి రాలేదు. వీళ్ళెవరూ ఆమె ఇంటికి వెళ్ళలేదు. బంధువులందర్నీ దూరం పెట్టడానికి ఆమెకు ఎన్నో కారణాలున్నాయి.

"నాన్న చివరి రోజుల్లో నేను ఇండియాలో లేను మధూ. నాన్నను బతికించుకోలేకపోయాను." కన్నీరు పెట్టుకుంది.

ఆ చుట్టుపక్కల తిరిగే పనివాళ్ళు, భర్తా, వారందరికీ చెప్పుకోలేని విషయాలు తనతోనే చెప్పుకుంటోందని అనిపించి , మనసులో తెలియని తృప్తి కలిగింది.

మహారాణి లాంటి స్త్రీ, అలా తనముందు కన్నీరు కార్చడం చూసి, తనని ఆమె సన్నిహితురాలనుకుంటోందని సంతోషం వేసింది.

"అది సరే , నిన్న నువ్వెందుకొచ్చావో అడగనే లేదు. చెప్పు ఏంటి విషయం?"

"నాన్నకు ఆరోగ్యం బాలేదు. ఆపరేషన్ చెయ్యాలంటున్నారు. గుండె ఆపరేషన్! మా దగ్గర అంత డబ్బులేదు. మీరు కొద్దిగా హెల్ప్ చేస్తే, వీలైనంత త్వరగా తీర్చేస్తాను."

"అలాగా , మరి చెప్పవే? ఇప్పుడెక్కడున్నాడు బాబాయి?" అంటూ లేచి నిల్చుంది.

హాస్పిటల్ పేర , డాక్టర్ పేరు కనుక్కుంది. ఇద్దరి ముగ్గురతో ఫోన్ లో మాట్లాడింది. ఓ పావుగంట తర్వాత మళ్ళీ మధుర దగ్గరకు వచ్చింది.

“ఆ హాస్పిటల్ బావగారి కజిన్ దే మధూ. నీకేం భయం లేదు. వచ్చే బుధవారమే ఆపరేషన్. అన్నీ ఏర్పాట్లు చేశాను. సరేనా.”

“అక్కా, చాలా థాంక్స్ అక్కా.” కన్నీళ్ళొచ్చాయి మధురకు.

“ఛ. థాంక్సెందుకు పిచ్చిదానా. నాన్నను బతికించుకోలేకపోయాను. కనీసం బాబాయి కోసమైనా, చేసే అవకాశం వచ్చింది.”

తనొచ్చిన పని ఇంత సులువు అయిపోవడం జీవితంలో ఇదే మొదటి సారి. చిన్నతనం నుండీ, ఎంతో కష్టపడితే తప్ప ఏదీ చేతికందని తనకు, ఇంత త్వరగా సమస్య తీరడం చాలా వింతగా ఉంది.

తండ్రికి రేపే ఆపరేషన్. హాస్పిటల్ పై అంతస్తులో ఉన్న గది నుండి బయటికి చూస్తోంది మధుర.

‘ ఏ సమస్యా లేకుండా అయిపోతే బాగుండు. పరీక్షలకు చదువుకోవాలి. ఇంకా ఎంతో టైం లేదు. మొదటి సారే పూర్తిచెయ్యాలి సివిల్స్. నాన్న కోరిక కూడా అదే. అక్క చేస్తున్న సహాయం తీర్చెయ్యాలి.’ ఆలోచిస్తోంది.

సాయంత్రం ఆకాశం మబ్బు పట్టి ఉంది. చల్ల గాలి వేగంగా వీస్తోంది.

గది బయట ఏదో అలికిడి అయితే, వరండాలోకి వెళ్ళి చూసింది. శార్వాణి వస్తోంది. ఆమె వెంట సర్జరీ చేయబోయే డాక్టర్ గారు ఇంకా ఎవరెవరో కూడా ఉన్నారు. మహారాణి సహాయకులతో నడిచి వస్తున్నట్టే ఉంది.

లోపలికి వచ్చాక డాక్టర్ తో మాట్లాడింది. నిన్న తనతో ఊరి విషయాలు మాట్లాడిన శార్వాణి కు, ఇప్పుడు డాక్టర్ తో దర్పంగా మాట్లాడే ఆమెకూ సంబంధమే లేదు.

“చాలా జాగ్రత్తగా చూసుకోవాలి డాక్టర్ గారూ” అంటూ చెప్తోంది.

ఆమె చెప్పే విషయాలు వినయంగా వింటున్నాడాయన. ఎంతో నమ్మకంగా మాట్లాడి హామీ ఇచ్చి వెళ్ళారు.

అందరూ బయటికి వెళ్ళాక,

"బాబాయి!" అంటూ బెడ్ మీదే కూర్చుని మాట్లాడింది. పినతండ్రికి ధైర్యం చెప్పింది. ఈ ఆపరేషన్ అయాక కూడా నీ బాధ్యత నాదేనంది.

"నాన్నకేమీ చెయ్యలేకపోయాను." అంటూ తడి కళ్ళు తుడుచుకుంది.

"అలా అనకు అమ్మా. పెద్దింటికోడలివి. నీకెన్నో బాధ్యతలుంటాయి. అన్నయ్య ఏనాడూ నీగురించి పొరపాటుగా అనుకోలేదు. చిన్నప్పటినుండీ నీ తీరు మాకు తెలియదా?"

"ఇక మధూ సంగతి కూడా నేనే చూసుకుంటాను బాబాయి. నువ్వేమీ దిగులు పడకు" అన్నది.

‘దేవతలా వచ్చావు. అందుకే నీ గుణానికి తగిన స్థానంలో ఉంచాడు ఆ దేవుడు.’ అనుకున్నాడాయన.

“అంతా దాని అదృష్టం తల్లీ.”

"సరే రేపు మళ్ళీ వస్తాను బాబాయి." అంటూ లేచి, “రా మధూ. నిన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను” అంది.

తండ్రి దగ్గరే ఉందామనుకుని వచ్చింది మధుర.

రానని ఎలా చెప్పాలా అని సంకోచిస్తూ, శార్వాణి వైపు చూసింది.

“ఇక భయమేమీ లేదు. బాబాయిని హాస్పిటల్ స్టాఫ్ చక్కగా చూసుకుంటారు. పర్లేదులే, రా.”

“వెళ్ళి రామ్మా. ఉదయాన్నే వచ్చేద్దువుగానీ. ఇక్కడేం ఉంటావు. వెళ్ళు.” తండ్రి కూడా చెప్పడంతో చెప్పులేసుకుని బయటికి వచ్చింది.

ఇద్దరూ బయటికి వచ్చారు. బయట, కారు దగ్గర డ్రైవర్ గానీ, వేరే ఎవరూ లేకపోవడం మధురకు ఆశ్చర్యం కలిగించింది.

కార్లో కూర్చున్న తర్వాత శార్వాణి చెప్పింది. “ఒకోసారి వంటరిగా నేనే డ్రైవ్ చేసుకుంటూ వెళతాను.”

దారిలో చాలా సేపు మౌనంగానే ఉంది. వాహనాలు తక్కువగా ఉన్న రోడ్డులో వెళుతున్నారు. ఆ రోడ్ లో ఎత్తైన చెట్లు గాలికి ఊగుతున్నాయి. కార్ విండో గ్లాస్ దించితే, రివ్వుమని చలిగాలి తగిలింది.

“ఇక నుండి, నీకేదైనా కావాలంటే, నేనే గుర్తుకు రావాలి. మొహమాట పడకు. సరేనా.”

“నువ్వింత సహాయం చేస్తావని నేనూహించలేదు. చాలా థాంక్స్ అక్కా.”

దేవుడే ఈమె రూపం లో సహాయం చేస్తున్నాడా. ఇది నిజమేనా? మధుర లోపల లోపల ఏవో ఆలోచిస్తోంది. శార్వాణికి కృతజ్ఞతలు చెప్పుకుందామని మనసులో తోచిన మాటలు బయటకు చెప్పబోతే అవేవో ఆరింద మాటల్లా, కృతకంగా అనిపించి ఆగిపోయింది.

అక్క ఋణం ఎలా తీర్చుకోవాలి.

" మధూ ఎక్కువ ఆలోచించి దిగులు పడకు. అంతా బాగానే జరుగుతుంది."

"అదికాదక్కా. మీ దగ్గరకు రాకముందు ఎన్నో చోట్ల ప్రయత్నం చేశాను. ఇక ఆశలు వదిలేసుకుని చివరిగా మీ దగ్గరకొచ్చాను. మీరు చేస్తున్న హెల్ప్ కు నేను బదులెలా తీర్చుకోవాలో తెలియడం లేదు."

"కనీసం ఈ మాత్రం సహాయం చేసుకోకపోతే, ఒకరికొకరం ఎందుకు చెప్పు. నేనెటూ దురదృష్టవంతురాలిని."

"అదేంటక్కా. అలా అంటారు?"

డబ్బున్న వారికేకష్టమూ ఉండదని అదిలేని వారు అనుకోవడం మామూలే.

సిటీకి చాలా దూరంగా ఉంది ఆ హాస్పిటల్. వారెళ్ళే దారిలో పంట పొలాలున్నాయి. కోత కొచ్చిన పొలాలు బంగారు రంగులో మెరుస్తున్నాయి. ఓ పక్కగా కారాపింది శార్వాణి.

చీకటి పడబోతోంది. పొలాల్లో పనిచేసే వాళ్ళు గట్లమీద నడిచి వెళుతున్నారు.

"నాకేదో తీర్చాలనే పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు మధూ. నీకు చేస్తున్న సహాయం చాలా చిన్నది. ఇదివరకెన్నో చేశానిలాంటివి. బదులు తీరుస్తారని ఎప్పుడూ ఏదీ చెయ్యలేదు మధు. ఆ దేవుడే నాకు సహాయం చేయాలి"

దేవుడు చెయ్యగలిగిన సహాయమా? ఆమెక్కూడా కష్టాలుంటాయా? లోపల్లోపల ఆశ్చర్యపడింది.

"నా కష్టం ఎవరూ తీర్చలేనిది మధూ. అందుకే బయటికి చెప్పుకోను."

ఆ కష్టమేమిటో చెప్పమని శార్వాణిని బలవంతం చేసేంత చనువులేదు మధురకు. మౌనంగా ఉంది.

" నేనుంటున్నది ఒక అందమైన లోకం. అది మాయమయే రోజు ఎంతో దూరంలో లేదు మధూ. అదే గనక జరిగితే.." ఆమె మధ్యలోనే ఆపేసింది.

ఆ ఇంటికి మహారాణి. ఆ స్థాయి మనుషుల కష్టాలేమిటో ఊహించుకోలేక శార్వాణి వంకే చూస్తోంది. ఆమె భర్త మంచివాడు కాదా?

శార్వాణి, ఆలోచనలు చదవగలుగుతోందా అన్నట్లు మాట్లాడుతోంది.

"ఆయన ఎంతో మంచివారు మధూ. నన్నెంతో బాగా చూసుకుంటారు. పెళ్ళయి పదిహేడేళ్ళవుతోంది. చిన్న విషయంలో కూడా ఆయన నన్ను నొప్పించరు."

మరేమిటి కష్టం?

"కొన్ని కష్టాలు ఎవరూ తీర్చలేనివి. అవన్నీ చెప్పి నీ మనసు బాధపెట్టడం వల్ల ఏం లాభం. పదపోదాం" అంటూ కారు స్టార్ట్ చెయ్యబోయింది.

"అదేమిటక్కా. మాకింత సహాయం చేస్తున్నారు. మీకోసం ఏమీ చెయ్యలేమా?"

"అది చాలా కష్టం."

"అలా అనొద్దక్కా. కష్టమైనా సరే, నాకు వీలైతే తప్పకుండా చేస్తాను."

"నిజంగా చెయ్యాలని ఉందా?"

"నిజంగానే చేస్తాను. చెయ్యగలిగిన పని ఏదైనా చేస్తాను."

“వీలైనా, చెయ్యగలిగినదైనా సరే, అది నీ వల్ల కాదు మధూ. వదిలెయ్యి.”

"అలా అనొద్దక్కా. ప్లీజ్. నాకో అవకాశం ఇచ్చి చూడండి. మీరింత సహాయం చేస్తున్నారు. మీకోసం నేనేమీ చెయ్యలేనా?”

“అయితే , నీ జీవితం నుండి ఒక సంవత్సరం నాకివ్వగలవా?”

“అంటే?”

“ ఒక సంవత్సరం పాటు నీ చుట్టూ ఉన్న ప్రపంచానికి దూరంగా ఉండాలి. ఆ తర్వాత, నీ ఇష్టం."

ఆమె ఏమి అడుగుతుందో మధురకు అర్థమే కాలేదు.

“ఒక సంవత్సరం పాటు, నువ్వు నీ ప్రపంచం నుండి నువ్వు మాయమైపోగలవా? సంవత్సరం తర్వాత నీ జీవితం నీదే. ఆ తర్వాత కూడా నీకు ఎలాంటి అవసరం వచ్చినా చూస్తాను. ఒక్క ఏడాది నాకోసం ఇచ్చెయ్యగలవా?”

“మరి నాన్న?” ఆయన్నెవరు చూసుకుంటారు.

“నువ్వొప్పుకుంటే ఈ క్షణం నుండీ బాబాయి పూర్తి బాధ్యత అంతా నాదే. ఆయన్ని ఒప్పించే బాధ్యత కూడా నాదే.”

అప్పటికప్పుడు ఏమ్మాట్లాడాలో అర్థం కాలేదు మధుర కు.

ఆమె చెప్తున్న విషయం , ఏదో చిక్కుముడిలా అనిపించి, ఆమె వైపు చూస్తోంది.

“చిన్నపిల్లవు. ఇవన్నీ నీకర్థం కావు. నువ్వేదో చెయ్యాలని, చేస్తావని కాదు మధూ నీకు చెప్పుకుంటున్నది. నేనుండే పరిస్థితిలో మాట చెప్పుకోడానికి మనుషులు దొరకడం కూడా కష్టమే. నువ్వేమీ చెయ్యలేవనీ తెలుసు.”

“అలా అనొద్దక్కా. ప్లీజ్,”

“చెప్పాను కదా కష్టమనీ, నువ్వు చెయ్యలేవనీ. వెళ్దామా.”

పరీక్ష హాలుకెళ్లకుండానే, ఫెయిలయ్యావన్న రిజల్ట్ వస్తే ఎవరైనా ఒప్పుకుంటారా?

“నాన్న క్షేమంగా ఉంటాడంటే, నాకేమీ పర్వాలేదు. కానీ, నేనేం చెయ్యాలి ఆ సంవత్సరం?”

“నువ్వొప్పుకుంటేనే, ఆ ఏడాది నువ్వేం చెయ్యాలో చెప్తాను. నువ్వు క్షేమంగా ఉంటావు. ఏదైనా నీకిష్టమైతేనే. ”

కారు ఎప్పుడు స్టార్ట్ అయిందో, ఎప్పుడు తమ వీధి చివర్న ఆగిందో తెలియలేదు.

“ఆలోచించుకుని జవాబు చెప్పు. ఓ వారం టైం తీసుకో. నాకు కుదరదని చెప్పినా పర్లేదు. బాబాయికి నేను చేస్తున్న సహాయం ఆపను. సరేనా!”

ఏ నిర్ణయం తీసుకోవాలి.

ఇప్పుడేమని చెప్పాలి. రాత్రి మూడింటివరకూ నిద్రపోకుండా ఆలోచిస్తూనే ఉంది.

సొరంగం లో ప్రయాణించే వారు, ఎటు వేపు వెళ్ళాలోనని అతిగా ఆలోచించనక్కర్లేదు.

*( ఇంకా ఉంది )*

Post your comments